# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 20 సంచిక : 166 శుక్రవారం 20, ఫిబ్రవరి 2026 పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com




## కవిత బీఆర్ఎస్ అనబోయి బీజేపీ అన్నట్లున్నారు

**కవిత పార్టీని స్థాపిస్తే భూస్థాపితమయ్యేది బీఆర్ఎస్ అన్న రామచందర్ రావు**

**కవిత ఏ పార్టీ నుంచి ఓడిపోయారు,**

**ఎవరి చేతిలో ఓడిపోయారో గుర్తుంచుకోవాలని వ్యాఖ్య**

**కవిత పార్టీ స్థాపిస్తే తమకు ఏమీ కాదన్న రామచందర్ రావు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

మే నెల మొదటి వారంలో తమ పార్టీని ప్రకటిస్తామని తెలిపిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. తెలంగాణలో బీజేపీ భూస్థాపితం అవుతుందని చేసిన వ్యాఖ్యలపై ఆయన విమర్శలు గుప్పించారు. కవిత 'బీఆర్ఎస్' అనబోయి 'బీజేపీ' అన్నట్లుగా ఉంది ఆయన వ్యాఖ్యానించారు. ఆమె పొరపాటున తమ పార్టీ పేరును

..మిగతా 2లో

## హామీలు నెరవేర్చి మళ్లీ అధికారంలోకి వస్తాం

**ఆరు గ్యారంటీల అమలుతర్వాతే ఎన్నికలు**

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి**

**ఢిల్లీలో అగ్రనేతలతో భేటీ**


**మున్సిపల్ ఫలితాలపై హైకమాండ్ ప్రశంసలు**

**ప్రభుత్వ పని తీరుపై సంతృప్తి**

**పార్టీ బలోపేతానికి కీలక సూచనలు**

**రాజ్యసభ స్థానాలపై సీఎంతో చర్చ**

**రాజగోపాల్ రెడ్డి సమస్యకు త్వరలో పరిష్కారం**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని పూర్తిగా అమలు చేసి మళ్లీ ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలతో జరిగిన ముఖ్య సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలోని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, పార్టీ కీలక నేతలు సమావేశమయ్యారు. ఈ

..మిగతా 2లో




## జీహెచ్ఎంసీ విభజనపై హైకోర్టులో పిటిషన్

**ఈ నిర్ణయం చట్టపరమైన నిబంధనలకు విరుద్ధం**

**జనాభా లెక్కలు పూర్తయ్యేవరకు ఇటువంటి నిర్ణయాలు తీసుకోవద్దు**

**హైకోర్టులో వ్యాపారి గురువారెడ్డి కీలక పిటిషన్**

**జీవో నం.55 అమలు నిలిపివేయాలంటూ విజ్ఞప్తి**

**రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ను మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 55పై హైకోర్టులో

..మిగతా 2లో

## ఈ సారైనా.. హామీల అమలుకు నిధులు కేటాయించండి

**ఆరు గ్యారంటీలకు నిధులు కేటాయించండి**

**సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ**

**బడ్జెట్ ప్రవేశపెట్టే ముందులేఖతో సూచనలు**

**95 శాతం హామీలు పెండింగ్ పెట్టారని విమర్శ**

**రైతుబంధుపై మాట తప్పారని చురకలు**

**నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం**

**కేటాయింపులు చేయకపోతే నిలదీస్తామని హెచ్చరిక**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు సగం కాలం పూర్తవుతున్నప్పటికీ ఎన్నికల హామీల్లో ఎక్కువ భాగం ఇంకా అమలు కాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈసారి ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో అయినా హామీల అమలుకు తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. లేఖలో కేటీఆర్ పేర్కొన్నదేమంటే, కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 95 శాతం ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని విమర్శించారు. రెండు బడ్జెట్లలోనూ గ్యారెంటీల

..మిగతా 5లో



# కవిత కొత్త పార్టీ ముహూర్తం ఖరారు

తెలంగాణ పదం ఉండేలా పార్టీ పేరు రూపకల్పన

తెలంగాణ వాదమే కవిత కొత్త పార్టీ ముఖ్య ఉద్దేశ్యం

సిద్దిపేట, లేదా బోధన్ నుంచి కవిత పోటీ చేసే అవకాశం

ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీహెచ్ఎంసీలోనూ పోటీ చేస్తాం

మీడియాకు వివరాలు వెల్లడించిన కవిత

ప్రతిపక్షంగా బీఆర్ఎస్ విఫలమైందని వ్యాఖ్య

తెలంగాణలో బీజేపీకి స్థానం లేదని విమర్శించిన కవిత



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు దిశగా కీలక అడుగు వేశారు. మే నెల తొలి వారంలో శుభదినం చూసుకుని పార్టీని అధికారికంగా ప్రకటించనున్నట్లు ఆమె వెల్లడించారు. పార్టీ పేరులో తప్పనిసరిగా 'తెలంగాణ' అనే పదం ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణ వాదమే తమ పార్టీ ప్రధాన సిద్ధాంతమని పేర్కొన్నారు.

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేసే అవకాశముందని, అయితే తన

..మిగతా 2లో

## భవిష్యత్తులో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

**ఆదిలాబాద్ జైల్లో ఉన్న బాల్క సుమన్‌ను కలిసిన హరీశ్**

**బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టడం అన్యాయమని వ్యాఖ్య**

**భవిష్యత్తులో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్న హరీశ్**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ఆదిలాబాద్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తో మాజీ మంత్రి హరీశ్ రావు ములాఖత్ అయ్యారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. క్యాతనపల్లిలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ

..మిగతా 2లో

## ఏఐని శాసిద్దాం

**భవిష్యత్ అంతా కొత్త టెక్నాలజీదే**

**ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను అందిపుచ్చుకోవాలి**

**అప్పుడే మనం పురోభివృద్ధి సాధిస్తాం**

**ఏఐ టూల్స్ వాడుకొని ముందుకు సాగాలి**

**భారతదేశంలో యువ జనాభా ఎక్కువ**

**ప్రధాని నరేంద్ర మోడీ వెల్లడి**

**'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో కీలక ప్రసంగం**



**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**

కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ఏఐ) మానవ ఆలోచనలకు అందనంత దూరంలో ఉందని, దాని వినియోగం చట్టబద్ధంగా, పునః సమీక్షించేలా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ రాజధాని దిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో

..మిగతా 5లో

## నకిలీ వెబ్‌సైట్ల మాయాజాలం...

**సెర్చ్‌లో టాప్‌లో ఉందని నమ్మొద్దు**

**ఫిషింగ్ సైట్లపై పోలీసుల హెచ్చరిక**

**ప్రజలకు సజ్జనార్ కీలక సూచనలు**

**ఆన్‌లైన్ లావాదేవీలపై అప్రమత్తత**

**సైబర్ మోసాలపై వివరణ**

**అధికారిక వెబ్‌సైట్‌లనే వాడాలని పిలుపు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ఇంటర్నెట్ వినియోగం పెరిగిన తర్వాత ఏ చిన్న సమాచారం కావాలన్నా ప్రజలు వెంటనే గూగుల్ వంటి సెర్చ్ ఇంజిన్లను ఆశ్రయించడం సాధారణమైంది. అయితే ఇదే అలవాటు ఇప్పుడు సైబర్ నేరగాళ్లకు అవకాశంగా మారిందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ హెచ్చరించారు. సెర్చ్ ఫలితాల్లో మొదటి స్థానంలో కనిపించినంత మాత్రాన అది అసలైన, భద్రమైన వెబ్‌సైట్ అని నమ్మకూడదని ఆయన సూచించారు. ఆన్‌లైన్ లావాదేవీలు,

..మిగతా 2లో



## తెలంగాణ సెంటిమెంట్‌తో రాజకీయం ఇంకెన్నాళ్లు?

**జాతిపిత అని చెప్పుకోవడానికి సిగ్గుండాలన్న కడియం శ్రీహరి**

**అవకతవకలు, అక్రమాలు చేసి కుంభకోణాల్లో ఇరుక్కున్నారని విమర్శ**

**అధికారం పోయినా అహంకారం తగ్గలేదని మండిపాటు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ సెంటిమెంట్‌ను వాడుకుని ఇంకా ఎన్ని రోజులు రాజకీయం చేస్తారని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్యాణ లక్ష్మిషాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, దేశానికి జాతిపిత ఒకరేనని, అది మహాత్మాగాంధీ అని అన్నారు. తెలంగాణ ఎవరి జాగీరు కాదని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో ప్రతి ఒక్కరు పాల్గొన్నారని పేర్కొన్నారు. తెలంగాణ

..మిగతా 2లో

## తెలంగాణలో అమెరికా టెక్ దిగ్గజాలతో కలిసి పీపీపీని ప్రోత్సహిస్తున్నాం

**ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొన్న శ్రీధర్ బాబు**


**అమెరికా, ఇండియా వాణిజ్య మండలి ప్రతినిధులతో చర్చలు**

**పెట్టుబడిదారులకు ఐటీ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయన్న మంత్రి**

**న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):**

అమెరికా టెక్ దిగ్గజాలతో కలిసి తెలంగాణలో పీపీపీని ప్రోత్సహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్' సదస్సులో ఆయన పాల్గొన్నారు. అమెరికా, ఇండియా వాణిజ్య

..మిగతా 2లో



# నకిలీ వెబ్‌సైట్ల మాయాజాలం...

**మొదటిపేజీ తరువాయి**

సేవల వినియోగంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.



ఇటీవల నగరంలో ఫిషింగ్ వెబ్‌సైట్ల ద్వారా మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు ఈ హెచ్చరికలు జారీ చేశారు. సైబర్ మోసగాళ్లు 'సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్' అనే సాంకేతిక పద్ధతిని వినియోగిస్తూ తమ నకిలీ వెబ్‌సైట్లను సెర్చ్ ఫలితాల్లో పైభాగంలో కనిపించేలా చేస్తున్నారు. అంతేకాకుండా పెయిడ్ యాడ్స్ సాయంతో ప్రజలను ఆకర్షిస్తున్నారు. బ్యాంకులు, ప్రభుత్వ శాఖలు, ప్రముఖ ఈకామర్స్ సంస్థల పేర్లతో అసలు వెబ్‌సైట్లను పోలి ఉండేలా నకిలీ సైట్లను రూపొందిస్తున్నారు.

వినియోగదారులు కస్టమర్ కేర్ నంబర్లు, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు లేదా ఇతర ఆన్‌లైన్ సేవల కోసం సెర్చ్ చేస్తే, ఈ నకిలీ సైట్లు ముందుగా కనిపించేలా చేస్తున్నారు. లింక్ పక్కన చిన్న అక్షరాలతో 'Sponsored' లేదా 'Ad' అని ఉన్నా చాలామంది గమనించరు. ఫలితంగా అవే అసలైన సైట్లు అనుకుని క్లిక్ చేస్తారు. అలా క్లిక్ చేసిన వెంటనే మోసం ప్రారంభమవుతుంది.వెబ్‌సైట్ ఓపెన్ అయిన తర్వాత యూజర్‌నేమ్, పాస్‌వర్డ్, ఓటీపీ, క్రెడిట్ కార్డు లేదా డెబిట్ కార్డు నంబర్, సీవీవీ వంటి అత్యంత గోప్యమైన వివరాలను నమోదు చేయమని అడుగుతారు. కొన్నిసార్లు బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్ నంబర్, పాన్ కార్డు వివరాలు కూడా కోరుతారు. వినియోగదారు తెలియక వాటిని నమోదు చేస్తే, ఆ వివరాలు నేరుగా మోసగాళ్ల చేతికి చేరుతాయి. కొద్ది నిమిషాల్లోనే బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయం అవుతాయి.

పోలీసుల సమాచారం ప్రకారం, ఇటువంటి మోసాల్లో బాధితులు ఆర్థికంగా మాత్రమే కాకుండా వ్యక్తిగతంగా కూడా నష్టపోతున్నారు. సేకరించిన వ్యక్తిగత వివరాలను ఉపయోగించి 'ఐడెంటిటీ థెఫ్ట్'కు పాల్పడే ప్రమాదం ఉంది. అంటే బాధితుడి పేరుతో రుణాలు తీసుకోవడం, అక్రమ లావాదేవీలు చేయడం లేదా ఇతర నేరాలకు ఉపయోగించడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో బాధితులు తరువాత తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.ఈ నేపథ్యంలో కమిషనర్ సజ్జనార్ ప్రజలకు కొన్ని కీలక సూచనలు చేశారు. ముందుగా ఏ వెబ్‌సైట్‌ను సందర్శించే ముందు దాని యూఆర్ఎల్ చిరునామాను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. అసలు వెబ్‌సైట్ స్పెల్లింగ్‌లో చిన్న మార్పులు చేసి నకిలీ సైట్లు రూపొందించడం మోసగాళ్ల సాధారణ పద్ధతి అని చెప్పారు. ఉదాహరణకు ఒక అక్షరాన్ని మార్చడం, అదనంగా ఒక చిహ్నం జోడించడం ద్వారా ప్రజలను మభ్యపెడతారని వివరించారు.

సాధ్యమైనంత వరకు సెర్చ్ ఫలితాలపై ఆధారపడకుండా, అధికారిక వెబ్‌సైట్ చిరునామాను నేరుగా బ్రౌజర్ అడ్రస్ బార్‌లో టైప్ చేసి ఓపెన్ చేయడం ఉత్తమమని సూచించారు. బ్యాంకులు లేదా ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లకు వెళ్లేటప్పుడు ప్రత్యేక జాగ్రత్త అవసరమని పేర్కొన్నారు. 'https' మరియు లాక్ గుర్తు ఉన్నాయా లేదా అనేది కూడా పరిశీలించాలన్నారు.సెర్చ్ ఫలితాల్లో 'Sponsored' లేదా 'Ad' అని కనిపించే లింకులపై క్లిక్ చేయడానికి ముందు రెండు సార్లు ఆలోచించాలని పోలీసులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే మాత్రమే ఆ లింక్‌ను ఓపెన్ చేయాలని, లేకపోతే అధికారిక వనరుల ద్వారా సమాచారం సేకరించాలని చెప్పారు. సోషల్ మీడియా ద్వారా వచ్చిన లింకులను కూడా అజాగ్రత్తగా ఓపెన్ చేయరాదని హెచ్చరించారు.

ముఖ్యంగా ఎవరూ ఫోన్ ద్వారా లేదా వెబ్‌సైట్ ద్వారా ఓటీపీ, పాస్‌వర్డ్, సీవీవీ వంటి వివరాలను అడిగితే ఇవ్వకూడదని పోలీసులు స్పష్టం చేశారు. బ్యాంకులు లేదా ప్రభుత్వ సంస్థలు ఇలాంటి వివరాలు ఎప్పుడూ అడగవని గుర్తుంచుకోవాలని చెప్పారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వచ్చినా, డబ్బులు పోయిన తర్వాత గమనించినా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు వెంటనే కాల్ చేయాలని, అలాగే అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. త్వరగా స్పందిస్తే నష్టాన్ని కొంత వరకు అడ్డుకునే అవకాశం ఉంటుందని పోలీసులు వివరించారు.

ఆన్‌లైన్ ప్రపంచంలో సాంకేతికత ఎంత వేగంగా మారుతుందో, మోసాల పద్ధతులు కూడా అంతే వేగంగా మారుతున్నాయని అధికారులు చెబుతున్నారు. అందుకే ప్రతి వినియోగదారు అప్రమత్తంగా ఉండడం అత్యవసరం. తెలియని లింకులను క్లిక్ చేయకపోవడం, అనుమానాస్పద వెబ్‌సైట్లలో వివరాలు నమోదు చేయకపోవడం వంటి చిన్న జాగ్రత్తలే పెద్ద నష్టాన్ని తప్పించగలవని పేర్కొన్నారు. "డిజిటల్ యుగంలో జాగ్రత్తే రక్షణ" అని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. సెర్చ్‌లో టాప్‌లో కనిపించిందని గుడ్డిగా నమ్మకుండా, ప్రతి అడుగులో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సరైన అవగాహన, తక్షణ స్పందనతోనే సైబర్ మోసాలను అరికట్టవచ్చని పోలీసులు తెలిపారు.

# కవిత కొత్త పార్టీ ముహూర్తం ఖరారు

**మొదటిపేజీ తరువాయి**

తొలి ప్రాధాన్యం సిద్దిపేట కాగా రెండో ఎంపికగా బోధన్‌ను పరిశీలిస్తున్నట్లు కవిత తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటమే తమ రాజకీయ లక్ష్యమని, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు.

భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభావం తగ్గిపోతుందని, తమ పార్టీనే ప్రధాన ప్రతిపక్షంగా ఎదుగుతుందని కవిత ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలతో పాటు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో కూడా పోటీ చేస్తామని ప్రకటించారు.

ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కూడా గతంలోని భారత్ రాష్ట్ర సమితి విధానాలనే కొనసాగిస్తోందని ఆమె విమర్శించారు. రాష్ట్రంలో కొత్త తరహా రాజకీయాలు కనిపించడం లేదని, వ్యక్తి ఆధారిత పార్టీలకంటే వ్యవస్థల ఆధారంగా నడిచే రాజకీయ నిర్మాణం అవసరమని అభిప్రాయపడ్డారు. పార్టీకి స్పష్టమైన సిద్ధాంత పునాది ఉండాలని తెలిపారు.

మహిళలను రాజకీయాల్లో అవమానించవద్దని కవిత సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉన్న వైఎస్ షర్మిలా రెడ్డి ఉదాహరణను ప్రస్తావిస్తూ, తెలంగాణలో బయట రాష్ట్ర నాయకత్వంతో పార్టీలు ఏర్పాటు చేయడం ప్రజలకు నచ్చలేదని వ్యాఖ్యానించారు. గతంలో సినీనటుడురాజకీయ నాయకుడు నందమూరి తారక రామారావు పార్టీ స్థాపించి కొత్త రాజకీయాలకు మార్గం చూపిన విషయాన్ని గుర్తుచేశారు. కొత్త తరానికి తమ పార్టీలో అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.



**తెలంగాణలో కవిత ప్రభావం ఎలా?**

రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, మహిళా నాయకురాలిగా ఉన్న గుర్తింపు కవితకు ప్రారంభ స్థాయిలో రాజకీయ మద్దతు తెచ్చిపెట్టే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే బలమైన ప్రాంతీయ, జాతీయ పార్టీలు ఉన్న నేపథ్యంలో కొత్త పార్టీకి స్థిరమైన ఓటు బ్యాంక్ ఏర్పరచుకోవడం సవాలుగా మారనుంది. గ్రామస్థాయి కేడర్ నిర్మాణం, స్పష్టమైన రాజకీయ అజెండా ఆధారంగా ఆమె రాజకీయ భవిష్యత్తు నిర్ణయించబడే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ప్రారంభ దశలో కొన్ని ప్రాంతాల్లో ప్రభావం చూపగలిగినా, రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడం పార్టీ సంస్థాగత బలంపై ఆధారపడి ఉంటుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## తెలంగాణలో అమెరికా టెక్ దిగ్గజాలతో కలిసి
# పీపీపీని ప్రోత్సహిస్తున్నాం

**మొదటిపేజీ తరువాయి**

మండలి ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కృత్రిమ మేధ (ఏఐ) ఆవిష్కరణలకు తెలంగాణ వేదికగా ఉందని మంత్రి అన్నారు.

పెట్టుబడిదారులకు ఐటీ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో తమ ప్రభుత్వ స్థిరమైన విధానాల కారణంగా ఏఐ పరిశోధనలకు రాష్ట్రం వేదికగా మారింది. ప్రజాసేవల్లోనూ ఏఐ ద్వారా వేగంగా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.



# తెలంగాణ సెంటిమెంట్‌తో రాజకీయం ఇంకెన్నాళ్లు?

**మొదటిపేజీ తరువాయి**



రాష్ట్రానికి కేసీఆర్ జాతిపిత ఎలా అయ్యారని ప్రశ్నించారు. జాతిపిత అని చెప్పుకోవడానికి సిగ్గుండాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. జాతిపిత అయితే ప్రజల్లోకి వచ్చి సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు.

కేసీఆర్ తన హయాంలో అవకతవకలు, అక్రమాలు చేసి కుంభకోణాలలో ఇరుక్కున్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తే అది కూలిపోయిందని, రాష్ట్రాన్ని దివాలా తీయించారని అన్నారు. ప్రజలు అధికారం నుంచి దింపినా వారికి ఇంకా అహంకారం తగ్గలేదని విమర్శించారు.

# హామీలు నెరవేర్చి మళ్లీ అధికారంలోకి వస్తాం

**మొదటిపేజీ తరువాయి**



ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. దాదాపు రెండు గంటల పాటు సమావేశం కొనసాగిందని మహేశ్ కుమార్ తెలిపారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పనితీరుపై హైకమాండ్ సమీక్ష నిర్వహించిందని ఆయన చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో మెజారిటీ హామీలను ఇప్పటికే అమలు చేశామని వివరించారు. ఇంకా మూడు సంవత్సరాల సమయం ఉందని, మిగిలిన హామీలను కూడా పూర్తిచేసి ప్రజల ప్రశంసలు అందుకుంటామని అన్నారు.గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, భారీగా అప్పులు మిగిల్చి వెళ్లారని ఆరోపించారు. దాదాపు రూ.8 లక్షల కోట్ల అప్పు భారం ఉన్నప్పటికీ, అందుబాటులో ఉన్న వనరులతో సమర్థంగా పాలన కొనసాగిస్తున్నామని చెప్పారు. పరిమిత నిధులతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు.

ఇటీవలి ఎన్నికల ఫలితాలపై హైకమాండ్ రాష్ట్ర నాయకత్వాన్ని అభినందించిందని మహేశ్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై సుమారు 80 శాతం ప్రజలు సంతృప్తిగా ఉన్నారనే అంచనాలను సమావేశంలో ప్రస్తావించారని చెప్పారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా మరింత కృషి చేస్తామని అన్నారు.ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల విధానంపై రాహుల్ గాంధీ ప్రత్యేకంగా వివరాలు అడిగి తెలుసుకున్నారని తెలిపారు. విద్యా రంగంలో చేపట్టిన సంస్కరణలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. వ్యవసాయ రంగంపై కూడా చర్చ జరిగిందని, వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని వివరించారు. ఇతర పంటలను కూడా ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచనలు వచ్చాయని చెప్పారు.

సమావేశంలో ప్రభుత్వం, పార్టీ వ్యవహారాలపై సమగ్రంగా చర్చించినట్లు మహేశ్ కుమార్ తెలిపారు. భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ పెద్దలు మార్గనిర్దేశం చేశారని చెప్పారు. మంత్రుల అభిప్రాయాలు కూడా వినిపించారని, అన్ని అంశాలపై స్పష్టమైన దిశానిర్దేశం లభించిందని అన్నారు. సమావేశం సానుకూల వాతావరణంలో జరిగిందని పేర్కొన్నారు.నామినేటెడ్ పదవుల భర్తీపై కూడా చర్చ జరిగిందని వెల్లడించారు. మార్చి మొదటి వారంలో నామినేటెడ్ పోస్టుల ను భర్తీ చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. పార్టీ పదవులను కూడా మార్చి 15లోపు పూర్తి చేస్తామని చెప్పారు. పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

అన్ని గ్యారంటీలు అమలు చేసిన తరువాతే ఎన్నికలకు వెళ్తామని మహేశ్ కుమార్ స్పష్టం చేశారు. హామీలు ఇచ్చి వాటిని వాయిదా వేయడం తమ విధానం కాదన్నారు. గత ప్రభుత్వంలా హామీలు తప్పించుకునే ప్రసక్తే లేదని వ్యాఖ్యానించారు.రాజ్యసభ ఎన్నికలపై రెండు మూడు రోజుల్లో ముఖ్యమంత్రితో పాటు తనను కూడా హైకమాండ్ పిలిచి చర్చిస్తుందని తెలిపారు. అభ్యర్థుల ఎంపికపై త్వరలోనే నిర్ణయం వెలువడుతుందని సూచించారు. అయితే మంత్రివర్గ విస్తరణ అంశం ఈ సమావేశంలో చర్చకు రాలేదని స్పష్టం చేశారు.

రాజగోపాల్ రెడ్డి అంశం మాత్రం సమావేశంలో ప్రస్తావనకు వచ్చిందని చెప్పారు. త్వరలోనే ఆయనతో హైకమాండ్ చర్చించనుందని వెల్లడించారు. పార్టీ ఐక్యత, బలోపేతం దిశగా చర్యలు కొనసాగుతాయని అన్నారు. మొత్తానికి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ముందుకు సాగుతోందని, మిగిలిన కాలంలో మరింత వేగంగా పనులు పూర్తి చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# కవిత 'బీఆర్ఎస్' అనబోయి 'బీజేపీ' అన్నట్లున్నారు

**మొదటిపేజీ తరువాయి**



ఉందని అన్నారు.

కవిత పార్టీని స్థాపిస్తే భూస్థాపితం అయ్యేది బీఆర్ఎస్ తప్ప తమ పార్టీ కాదని ఆయన అన్నారు. గత లోక్ సభ ఎన్నికల్లో కవిత ఏ పార్టీ నుంచి ఓడిపోయారు, ఎవరి చేతిలో ఓడిపోయారో ఒకసారి గుర్తుతెచ్చుకోవాలని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తమ పార్టీకి ఓట్ల శాతం పెరిగిందని రామచందర్ రావు అన్నారు.

కాగా, ఈరోజు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. శివాజీ దేశం కోసం, ధర్మం కోసం మొఘలులతో పోరాడారని అన్నారు. ఆయన తన హయాంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు.

# జీహెచ్ఎంసీ విభజనపై హైకోర్టులో పిటిషన్

**మొదటిపేజీ తరువాయి**

సవాల్ నమోదైంది. ఈ నిర్ణయం చట్టపరమైన నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ వ్యాపారి గురువారెడ్డి గురువారం పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం 2027 జనాభా లెక్కలు (సెన్సస్) పూర్తయ్యే వరకు స్థానిక సంస్థల పునర్విభజన వంటి కీలక పరిపాలనా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని వాదించారు. జనగణన ప్రక్రియ ముగియకముందే జీహెచ్ఎంసీని విభజించడం రాజ్యాంగ, పరిపాలనా మార్గదర్శకాలకు వ్యతిరేకమని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

**స్టే కోరిన పిటిషనర్**

జీవో నం.55 అమలును తాత్కాలికంగా నిలిపివేయాలని, జనాభా లెక్కలు పూర్తయ్యే వరకు జీహెచ్ఎంసీని యథాతథంగా కొనసాగించాలని పిటిషనర్ కోర్టును కోరారు. విభజన నిర్ణయం అమల్లోకి వస్తే పరిపాలనా గందరగోళం ఏర్పడటంతో పాటు పన్నులు, సేవలు, ఆస్తి పరిపాలన వంటి అంశాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశముందని పేర్కొన్నారు.

**హైకోర్టు స్పందన**

వాదనలు వినిన హైకోర్టు ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వాల నుంచి వివరణ కోరుతూ తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. అప్పటి వరకు ప్రభుత్వ వైఖరి, చట్టపరమైన ఆధారాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని న్యాయ వర్గాలు భావిస్తున్నాయి. జీహెచ్ఎంసీ విభజన నిర్ణయం నగర పరిపాలన వికేంద్రీకరణ, సేవల వేగవంతం లక్ష్యంగా తీసుకున్న చర్యగా ప్రభుత్వం పేర్కొంటున్నప్పటికీ, దీనిపై చట్టపరమైన అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జనగణనకు ముందు స్థానిక సంస్థల పునర్వ్యవస్థీకరణ సరైనదా అనే అంశం ఇప్పుడు న్యాయపరంగా కీలకంగా మారింది. ఈ కేసులో హైకోర్టు ఇచ్చే తదుపరి ఆదేశాలు జీహెచ్ఎంసీ పునర్విభజన ప్రక్రియపై ప్రభావం చూపే అవకాశముందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.




# భవిష్యత్తులో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

**మొదటిపేజీ తరువాయి**

చేసిందని మండిపడ్డారు.

రాష్ట్రంలో పట్టపగలే ప్రజాస్వామాన్ని ఖూనీ చేశారని, ప్రజలు ఇచ్చిన తీర్పును కాదని బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. శుక్రవారం ఆదిలాబాద్ జైలులో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో ఆయన ములాఖత్ అయ్యారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లిలో పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఖూనీ చేసిందన్నారు. మహిళల పట్ల కాంగ్రెస్ నేతలు అసభ్యకరంగా ప్రవర్తించడం సరికాదని, మంత్రి వివేక్ సైతం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు మద్యం మత్తులో బీఆర్ఎస్ మహిళా కౌన్సిలర్లను అగౌరవపరిచారన్నారు. కానీ ఈ విషయాన్ని మంత్రి సైతం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఇంత జరిగినా ఎన్నికల కమిషన్ చోద్యం చూస్తోందా అని ప్రశ్నించారు. పోలీసులు సైతం కాంగ్రెస్ నాయకులకు చుట్టముల వ్యవహరిస్తున్నారన్నారు.

పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడం సరికాదు..

బాల్క సుమన్‌ను సమీపంలో ఉన్న జైల్లో పెట్టకుండా 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇల్లు వేయడం అన్యాయమని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు రాజ్యాంగం ఖూనీ చేస్తుంటే రాహుల్ గాంధీకి పట్టదా అన్నారు. ప్రజా తీర్పును కాలరాయడం సరికాదన్నారు. అదేవిధంగా పోలీసులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చుట్టంలా వ్యవహరిస్తున్నారని చట్టం ఎవరికి చుట్టం కాదని అన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడం సరికాదని.. పోలీసులు తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల రక్షణ కోసం కవాతు నిర్వహించాల్సిన పోలీసులు బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురిచేసేందుకు పోలీసు కవాతు నిర్వహిస్తున్నరన్నారు. ఇందులో మాజీ మంత్రి జోగురామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ శంభోపతి రాజు, నాయకులు దివాకర్ రావ్, ప్రవీణ్ కుమార్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## సరస్వతీ శిశుమందిర్ లో ఘనంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు

**ఆదిలాబాద్ జిల్లా ఫిబ్రవరి 19 (ప్రజాస్వరం):-**

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రము లోని స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల లో హిందూ సామ్రాజ్య స్థాపకుడు, మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి ని పురస్కరించుకొని పాఠశాల లో జయంతి వేడుకలు నిర్వహించారు.ఆచార్యు లు విద్యార్థులు శివాజీ మహరాజ్ ప్రతిమకు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ప్రధానాచార్యులు మరాఠీ సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహరాజ్ యొక్క గొప్పతనాన్ని విద్యార్థులకు వివరిస్తూ హిందూ సామ్రాజ్య స్థాపన కోసం తన ప్రాణాలను అర్పించి ఎంతో మందికి స్ఫూర్తి దాయకం గా నిలిచి యుద్ధం లో శత్రువులను చీల్చి చెండాడి మట్టి కరిపించిన తీరును వివరించారు. ఛత్రపతి శివాజీ యొక్క గొప్పతనాన్ని,ధైర్య సాహసాలను, హిందుత్వ నిష్టను మనమంతా ఆదర్శంగా తీసుకొని భారతీయ విలువలను పెంపొందించు కోవాలనీ అన్నారు.ఆచార్యులు ఉషారాణి, భారతి,సుజాత,మంజుల,శంకర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కిష్టాపూర్ లో ఛత్రపతి శివాజీ విగ్రహం ఆవిష్కరణ...

**తూప్రాన్ ఫిబ్రవరి 19 (ప్రజా స్వరం )**



మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కిష్టాపూర్ లో గురువారం రోజు నూతన ఛత్రపతి శివాజీ విగ్రహం ఆవిష్కరణ తెలంగాణ బి ఆర్ ఎస్ యువ నాయకులు వంటేరు విజయ వర్ధన్ రెడ్డి చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ యువత శివాజీ మార్గాన్ని ఎంచుకోవాలని మద్యం కు బానిసలుగా కాకుండా సనాతన ధర్మం వైపు ధైర్యం తో ముందుకు వెళ్లాలన్నారు త్వరలో కిష్టాపూర్ లో ఉమ్మడి తూప్రాన్ మండలం లోని గ్రామాల యువత తో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేస్తా అని ఆయన అన్నారు యువకులు కిష్టాపూర్ టీం కు క్రికెట్ కిట్టు ఇవ్వాలని కోరగా వెంటనే స్పందించి రెండు రోజులలో ఇప్పిస్తా అని హామీ ఇచ్చారు మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, భారతదేశ చరిత్రలో ఛత్రపతి శివాజీగా ప్రఖ్యాతి గాంచిన వీరుడు హిందువులు. అయినా శివాజీకి తల్లి జిజాబాయి హిందూ పురాణాలు, రామాయణ, మహాభారత కావ్యాలు, మరాఠీ సాహిత్యం నేర్పించ్చింది.. శివాజీ 1680 ఏప్రిల్ 3న రాజగడ్‌లో మరణించాడు. అతని మరణం తరువాత, అతని కుమారుడు సంభాజీ మరాఠా సామ్రాజ్యానికి పాలకుడు అయ్యాడుఅని ఆయన అన్నారు శివాజీ భారతదేశ చరిత్రలో గొప్ప వీరులలో ఒకడిగా పేరు పొందినాడు. అతని విజయాలు, నాయకత్వం, హిందూ సంస్కృతి పట్ల అతని అంకితభావం భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడని విజయ వర్ధన్ రెడ్డి అన్నారు ఈ కార్యక్రమం లో కిష్టాపూర్ సర్పంచ్ హిమ బిందు శ్రీశైలం మాజీ జడ్పీటీసీ రాణి సత్యనారాయణ గౌడ్ మల్కాపూర్ సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ ఇస్లాంపూర్ మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి మాజీ యావపూర్ ఎంపీటీసీ సంతోష్ రెడ్డి శామ్ సుందర్ రెడ్డి రవి కుమార్ మహేష్ గౌడ్ శివాజీ యువత అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు



## శేరిపల్లిలో ఘనంగా శివాజీ 396వ జయంతి వేడుకలు..

**నార్సింగి, ఫిబ్రవరి 19 ( ప్రజా స్వరం )**

నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో మరాఠా యోధుడు, హిందూ సామ్రాజ్య స్థాపకుడు చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి సర్పంచ్ వార్డు సభ్యులు పాల్గొని శివాజీ మహారాజ్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు, అనంతరం యువకులు గ్రామంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు ప్యాడ్లు పంపించేశారు అలాగే శివాజీ పైన వ్యాసరచన పోటీ నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు అరుణ్ యాదవ్, గ్రామస్తులు బాలకృష్ణ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి సంవత్సరం శివాజీ జయంతి వేడుకలు శివాజీ యూత్ వారు నిర్వహించడం చాలా సంతోషమని అందరు కూడా శివాజీ బాటలో నడవాలని హిందువులందరూ ఏకతాటిపై ఉండాలని అన్నారు, యూత్ సభ్యులు నిఖిల్ మాట్లాడుతూ వేడుకలకు విచ్చేసిన పాలకవర్గానికి వారు అభినందనలు తెలియజేశారు, వచ్చే ఏడాది లోపు గ్రామంలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు పాలకవర్గం కృషి చేయాలని, వేడుకలను విగ్రహంతో జరుపుకోవాలని వారు కోరారు, సానుకూలంగా స్పందించిన సర్పంచ్ సంతోష గౌండస్వామి యాదవ్ మాట్లాడుతు తప్పకుండా విగ్రహ ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తామని వారు తెలిపారు యువకులు చూపిస్తున్న చొరవ చాలా బాగుందని యువకులు చెడు మార్గంలో వెళ్లకుండా మంచి మార్గంలో నడవాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంతోష గౌండస్వామి యాదవ్, వార్డు సభ్యులు అరుణ్ యాదవ్, నవీన్ కుమార్, మల్లేశం, మాజీ వార్డు సభ్యులు మ్యకల శ్రీనివాస్, గ్రామస్తులు మల్లేశం, శంకర్, బాలకృష్ణ,,సంతోష్, సత్యనారాయణ, సందీప్, వేణు, యూత్ నాయకులు రవి గౌడ్, శ్రావణ్ కుమార్, పూసల నిఖిల్, నాని, రాము, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## జెఈఈ మెయిన్స్ లో మెరిసిన బీసి గురుకుల ఎంజేపీ విద్యార్థులు

- **అభినందనలు తెలిపిన ప్రిన్సిపాల్ బి. స్రవంతి**

**పఠాన్ చెరు,ఫిబ్రవరి 19, ప్రజా స్వరం**

పఠాన్ చెరు మండలంలోని చిన్న కంచర్లలో ఉన్నా బీసీ గురుకుల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ కు దీటుగా జేఈఈ మెయిన్స్ లో ఉత్తమ ఫలితాలు సాధించారు.జేఈఈ మెయిన్స్ లో ఎచ్.సాయి ప్రణీత్,( 80.95%) జె. దేనిష్ కార్తీక్,(79.42%) డి. కార్తీక్ (76.66% )2026 జేఈఈ మెయిన్స్ లో మంచి ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా ఎంజేపీ గురుకుల ప్రిన్సిపాల్ బి. స్రవంతి, మాట్లాడుతూ.. కార్పొరేట్ కాలేజీలకు దీటుగా నిష్ణాతులైన అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన జరుగుతుందని విద్యార్థుల నిరంతర శ్రమ వల్ల ఇది సాధ్యమైంది అని తెలిపారు. విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని వచ్చే సంవత్సరంలో విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలని అన్నారు. విద్యార్థులకు ఎల్లప్పుడు పుస్తకాలు, విద్యా పరంగా ప్రభుత్వం ఎల్లప్పుడు ప్రోత్సహిస్తుందని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఏటీపీ రేఖాలక్ష్మి, అధ్యాపక బృందంతో కలిసి విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.









## కిష్టాపూర్ చెక్ డ్యామ్ లో నీరులేక ఎండిపోతున్న పంటలు......

**తూప్రాన్ ఫిబ్రవరి 19( ప్రజా స్వరం)**

తూప్రాన్ మండలం కిష్టాపూర్ ప్రాంతంలో హల్దీ వాగు పైన చెక్ డ్యామ్ (హల్దీవాగు) నీటిని అక్రమ ఇసుక పిలటర్లు ఏర్పాట్లు చేసి మోటార్ల ధ్వారా నీటిని తోడేయడం తో వాగు లో నిరులేక వ్యసాయ పంట లు ఎండిపోతున్నతాయని రైతులు ఆవేదన వ్యక్తి చేస్తున్నారు రెవెన్యూ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి అక్రమ ఇసుక పిలటర్లు ను సిజ్ చేయాలనీ కోరుతున్నారు సిద్ధిపేట జిల్లా వర్గల్ మండలంలో ప్రారంభమైన హల్దీ వాగు మేదక్ జిల్లా మీదుగా ప్రవహిస్తోంది. తూప్రాన్, మాసాయి పేట, వెల్దుర్తి, కొల్చారం మండలాలరైతులు ఈవాగుపైఆధారపడిపంటలు సాగు చేస్తున్నారు. రెండు జిల్లాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తే హల్దీ వాగు రెండు పంటలకు నీరు అందిస్తుంది. కిష్టాపూర్ శివారులో నీరు లేక ఎండిపోయిన హల్దీవాగులో పంటలు దెబ్బతిన్నాయి. రైతులు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి నీటిని విడుదల చేయాలని కోరారు. స్థానిక అధికార పార్టీ నాయకులు పట్టించుకోని నీరు విడుదల కు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు



## ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులా..!

- **అక్రమ కేసులకు భయపడేది లేదు.**
- **ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షులు దేవి రవీందర్**

**గజ్వేల్ ఫిబ్రవరి 19 (ప్రజాస్వరం) :**

ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షులు దేవి రవీందర్ మాట్లాడుతూ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో ఎన్నో అక్రమ కేసులు ఎదుర్కొని రాష్ట్ర సాధనలో ముందుండి పోరాడిన వారమని, ఇప్పుడు కూడా ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో అనుమతులు తీసుకుని ప్రచారం నిర్వహించడానికి వచ్చిన బిఆర్ఎస్ నాయకులపై దాడులకు దిగడం, తిరిగి వారిపైనే కేసులు నమోదు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ఎన్నికల హామీలను అమలు చేయకుండా అధికార దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టడం అన్యాయమని అయినప్పటికీ ప్రజల కోసం తమ పోరాటం ఆగదని తెలిపారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు పదేళ్ల పాలనలో గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులపై ఎన్ని కేసులు నమోదయ్యాయో, ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత బిఆర్ఎస్ నాయకులపై ఎన్ని కేసులు పెట్టించారో బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అరాచకాలు సృష్టిస్తూ అక్రమ కేసులు పెట్టడమే చేస్తున్నదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కిరణ్ కుమార్ చారి, బచ్చలి మైపాల్, నర్సింహారెడ్డి, టీఆర్ఎస్ నాయకులు నగేష్, శివకుమార్, భాస్కర్, రామ్ రెడ్డి, పెంటారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు..

## నాచారంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

**వర్గల్ ఫిబ్రవరి 19(ప్రజాస్వరం):**



మండలంలో నాచారం గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో గురువారం విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబెద్కర్ చేసిన సేవలు ఎనలేనివని బౌద్ధం స్వేచ్ఛ, సమానత్వం చాటుతుందన్నారు. ప్రపంచ శాంతి, దేశ అభివృద్ధికి గౌతమ బుద్ధుని బోధనలు, అంబేద్కర్ ఆలోచన విధానాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. అంబేద్కర్ ఎంతో శ్రమించి ఉన్నత చదువులు చదివి అహర్నిశలు శ్రమించి బహుజనులకు సమాజంలో నీడను కల్పించారని కొనియాడారు.త్వరలోనే విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

- **సర్పంచ్ పత్తి నర్సింలు**
- **దామరకుంట లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ**

**గజ్వేల్ ఫిబ్రవరి 19 (ప్రజాస్వరం):-**

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని సర్పంచ్ పత్తి నర్సింలు అన్నారు గురువారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం దామరకుంట గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు వచ్చిన కొంతం యాదమ్మ ఇల్లు నిర్మాణానికి ముగ్గుపోసే కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ పత్తి నర్సింలు మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన కొనసాగుతుందని, ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు దశలవారీగా నెరవేర్చుతూ ప్రజారంజక పరిపాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రతి ఒక్కరు అండగా ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి,గ్రామ ఉప సర్పంచ్ దేవి విజయ రమేష్, రాజబోయిన రమేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, ప్రభు, సంజీవ్, బాలరాజు ఆనంద్ శ్రీకాంత్ బాలచంద్రం అఖిల్ లింగం యాదగిరి రవి గౌడ్ శంకర్ యాదవ్, బాల నరసింహులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



# బాధ పడకు

**కరీంనగర్/హైదరాబాద్ (ప్రజాస్వరం)**

అందం లేదని బాధపడకు
ఆరోగ్యంగా ఉన్నందుకు
ఆనందించు
ఆస్తులు లేవని బాధపడకు
ఆదరణ వున్నందుకు ఆనందించు
గుర్తింపు లేదని బాధపడకు
గౌరవము ఉన్నందుకు ఆనందించు
సమస్యలు ఉన్నందుకు బాధపడకు
సంకల్పం ఉన్నందుకు ఆనందించు
సంపద లేదని బాధపడకు
సంస్కారం ఉన్నందుకు ఆనందించు
అధికారం లేదని బాధపడకు
అదుకునే తత్వం ఉన్నందుకు
ఆనందించు
పలుకుబడి లేదని బాధపడకు
ప్రేమ గుణం ఉన్నందుకు
ఆనందించు
ఆత్మీయులు లేరని బాధపడకు
అనుంగు మిత్రులు ఉన్నందుకు
ఆనందించు
బలహీనున్ని అని బాధపడకు
మనోబలం ఉన్నందుకు
ఆనందించు
బంధువులు లేరని బాధపడకు
భగవంతుడు అండగా ఉన్నాడని
ఆనందించు
మరుపు ఉన్నందుకు బాధపడకు
మరుపే నీ జీవితములో మార్పు
ఐనయిందుకు ఆనందించు
మణులు మాన్యాలు లేవని
బాధపడకు
మమత మానవీయత ఉన్నందుకు
ఆనందించు
సంపద లేదని భాధపడకు
సంతృప్తి ఉన్నందుకు సంతోషించు
హంగు ఆర్భాటం లేదని బాధపడకు
దయార్ద్ర హృదయం ఉన్నందుకు
ఆనందించు
చీకటిని తిడుతూ బాధపడకు
చిరుదివ్వెను వెలిగించి ఆనందించు
ఆంధోళన ఉన్నందుకు బాధపడకు
మనోధైర్యం ఉన్నందుకు
ఆనందించు
గుర్తింపు లేదని బాధపడకు
అభిమానులు ఉన్నందుకు ఆనందించు

నేదునూరి కనకయ్య అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం (ఫ్రీలాన్స్ రచయిత)
సామాజిక ఆర్థిక విశ్లేషకులు
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
9440245771





## సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే: కుంభం

**వలిగొండ ఫిబ్రవరి 19(ప్రజాస్వరం):** భువనగిరి జిల్లా వలిగొండ పట్టణంలోని వలిగొండ నుండి లింగరాజుపల్లి రోడ్డు శివాలయం నుండి వలిగొండ గుట్ట కింది వరకు 50 లక్షలతో మంజూరైన సి సి రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణంనకు వలిగొండ పట్టణంలో శంకుస్థాపన, వలిగొండ పట్టణంలో రోడ్డు పనుల విస్తరణ పనులను పరిశీలించి రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం వలిగొండ పట్టణ కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి రోడ్డు ఇరువైపుల ఉన్న డబ్బలను తొలిగించి వారికి శాశ్వత మడిగలు కట్టించి వారికి అందుబాటులోకి తెస్తామని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మా గ్రామానికి బస్సును పునరుద్ధరించాలి

- **మద్దెల మంజుల నాగరాజు**

**వలిగొండ ఫిబ్రవరి 19(ప్రజాస్వరం)**

వలిగొండ మండలం కెర్చుపల్లి గ్రామ సర్పంచ్ మద్దెల మంజుల నాగరాజు ఆధ్వర్యంలో కెర్చుపల్లి గ్రామ ప్రజలు, మహిళలు, విద్యార్థులు కలిసి భువనగిరి బస్ డిపో మేనేజర్ కి తమ గ్రామానికి బస్సు పునరుద్ధరించాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది.డిపో మేనేజర్ వెంటనే స్పందించి సోమవారం నుండి బస్ ను పునరుద్దీస్తున్నట్టు తెలిపారు.* దీనిలో భాగంగా సర్పంచ్ మంజుల నాగరాజు మాట్లాడుతూ మహిళలు, వృద్ధులు హాస్పిటల్కి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు అని తెలిపారు. టెన్త్ మరియు ఇంటర్ పరీక్షలు నడిచే సమయంలో బస్సులు రాకపోవడంతో విద్యార్థులు చాలా మానసిక ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. చాలామంది విద్యార్థులు బస్సు పాస్ తీసుకున్న తర్వాత బస్సు రాకపోవడంతో చాలా ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో,ఉప సర్పంచ్ దయ్యాల మల్లేష్,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు బర్మా జంగయ్య,కందడి శ్రీను,చిన్నం రాములు,లోడే మల్లయ్య,సిలోజు వెంకటాచారి,దయ్యాల ముత్యాలు,మహిళలు పాల్గొన్నారు డిపో మేనేజర్ హామీ ఇవ్వడంతో అందరూ హర్షం వ్యక్తం చేశారు.

## షాబాద్‌లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగాముఖ్య అతిథిగా హాజరైన గుర్రాల విష్ణువర్ధన్ రెడ్డిమద్దూర్ పాండు



- **"ధర్మం, ధైర్యం, ప్రజాస్వామ్య పాలనకు శివాజీ మహారాజ్ శాశ్వత స్ఫూర్తి" – గుర్రాల విష్ణువర్ధన్ రెడ్డి**

**షాబాద్ ఫిబ్రవరి 19(ప్రజాస్వరం):** షాబాద్ మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బజరంగ్ దళ్ పాలమూరు విభాగ్ కన్వీనర్ గూడెం రమేష్ ఆధ్వర్యంలో నాగర్ గూడ హనుమాన్ మందిర్ నుంచి షాబాద్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జయజయధ్వానాలతో ర్యాలీని విజయవంతం చేశారు.

ముఖ్య అతిథిగా హాజరైన గుర్రాల విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం యువతకు మార్గదర్శకమని అన్నారు. మహిళలకు గౌరవం, ప్రజలకు భద్రత కల్పించిన పరిపాలకుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. దేశంలో ధర్మరక్షణ, సామాజిక సమానత్వం కోసం శివాజీ చేసిన సేవలు ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సినవని తెలిపారు. యువత శివాజీ స్ఫూర్తిని ఆచరణలో పెట్టి సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ జిల్లా బౌదిక్ ప్రముఖ సాంబ మల్లేష్ కూడా మాట్లాడి శివాజీ మహారాజ్ చరిత్రను స్మరించుకున్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు రంగనాథ్, గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, బజరంగ్ దళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. జయంతి వేడుకలు ఉత్సాహభరితంగా,శాంతియుత వాతావరణంలో ముగిశాయి.



# వైస్ చైర్మన్ నరేష్ గౌడ్ కు ఘన సన్మానం...







**మెదక్ ఫిబ్రవరి 19 (ప్రజా స్వరం)** మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ గా ఎన్నికైన మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దొంతి నరేష్ గౌడ్ ను గురువారం మెదక్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ, ఇతర కార్యక్రమాలలో చేసిన కృషిని జర్నలిస్టులు కొనియాడారు. రానున్న రోజుల్లో సైతం నరేష్ గౌడ్ పట్టణ ప్రజలతో పాటు ఇటు జర్నలిస్టుల సంక్షేమానికి కోసం కూడా కృషి చేయాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి అనునిత్యం కృషి చేస్తానని మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్ అన్నారు. తాను ఏ పదవిలో ఉన్నప్పటికీ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టియూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు శంకర్ దయాల్ చారి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు నాగరాజు, జర్నలిస్టులు కామాటి కిషన్, సురేంద్ర రెడ్డి ప్రకాష్, కె. రామకృష్ణ, గోపాల్ గౌడ్, లక్ష్మణ్, శ్యామ్, రాము, సంగమేశ్వర్, రహమద్ అలీ, కార్తీక్, శ్రీహరి, సుభాష్, మల్లికార్జున్ లతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



# ఘనంగా జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు

**జగదేవ్ పూర్ ,ఫిబ్రవరి19, (ప్రజాస్వరం)** జగదేవ్ పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగదేవ్పూర్ చెందిన ఈవి వెంకట నరసింహా రెడ్డి ఐఏఎస్ హాజరయ్యారు.వారు కళాశాలలో 1983 85 సంవత్సరంలో విద్యను అభ్యసించినట్లు తెలిపారు.అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ..విద్యార్థులు ఏం మార్గంలో విద్యను అభ్యసించాలి అలాగే మొబైల్ అవసరం కొద్దీ వాడాలని చెడు మార్గంలోని మొబైల్ ను వాడవద్దని మంచి మార్గంలోకి మొబైల్లో ను వాడాలని తెలిపారు.అనంతరం 10 లక్షల రూపాయలు బ్యాంకు ఖాతాలో లక్ష్మీబాయి మెమోరియల్ ట్రస్ట్ జమ బ్యాంక్ చెక్కును ఉపాధ్యాయులకు అందించారు.సంవత్సరం నుంచి వచ్చిన వడ్డీని మెరుగైన ఫలితాలు వచ్చిన విద్యార్థులకు వచ్చిన వడ్డీ 60 వేల రూపాయలను ద్వారా సంవత్సరంలో విద్యార్థులు మంచి మెరుగైన ఫలితాలు వచ్చిన వారికి మొదటి ర్యాంక్ 30000 ,2 వ బహుమతికి 20000 ,3వ ర్యాంక్ 10000 అందించాలని అన్నారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్ గౌడ్,ఉప సర్పంచ్ గణేష్,వార్డు సభ్యులు,ఉపాధ్యాయులు, విద్యార్తులు పాల్గొన్నారు.



# శివాజీ మహారాజ్ అడుగుజాడల్లో యువత నడవాలి..

**తూప్రాన్ ఫిబ్రవరి 19 (ప్రజస్వరం )** తూప్రాన్ పట్టణం లో శివాజీ 368 వ జయంతి సందర్భంగా వైస్ చైర్మన్ సమతా కాశిరెడ్డి బిజెపి ఆర్ఎస్ఎస్ నాయకులు హిందూ అభిమానులు భారీగా శోభ యాత్ర లో పాల్గొన్నారు ఛత్రపతి శివాజీ మహారాజ్ చిన్నతనం నుండి దేశభక్తి కోసం దేశం కోసం పోరాడిన మహనీయుడని ఆయన సేవలను కొనియాడుతూ నర్సాపూర్ చౌరస్తాలోని శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడరు నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజాన్ని ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కాంతయపాలెం వేణుగోపాల్ మహేష్ గౌడ్ కార్తీక్ నర్సింహారెడ్డి రాకేష్ వాసు సాయి కిరణ్ శీత మహాలక్ష్మి శివశక్తి యూత్ నిర్వాహకులు భారీగా పాల్గొన్నారు



# ఏఐని శాసిద్దాం

**మొదటిపేజీ తరువాయి**

గురువారం ఆయన ప్రసంగించారు. మానవ అభివృద్ధిలో ఏఐ కీలక భూమిక పోషిస్తుందని, మేకిన్ ఇన్ ఇండియా, భారత ఆవిష్కరణ సామర్థ్యాన్ని ఈ సదస్సు చాటుతుందని పేర్కొన్నారు. ఈ సమ్మిట్ భారత్‌ను గ్లోబల్ ఏఐ హబ్‌గా స్థాపించడంలో ముఖ్యమైన మైలురాయిగా మారిందని, ఇక్కడ మూడు భారతీయ కంపెనీలు తమ ఏఐ మోడల్స్‌ను ప్రారంభించాయని ఆయన వెల్లడించారు.

ఈ సదస్సు ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాల నుంచి టెక్ లీడర్లు, పాలసీ మేకర్లు, ఇన్నోవేటర్లను సమీకరించింది. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేష్ అంబానీ వంటి ప్రముఖులు పాల్గొన్నారు. అంబానీ తమ జియో కంపెనీ ఏఐలో రూ.10 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించారు. సుందర్ పిచాయ్ మాట్లాడుతూ, భారత్‌లో మార్పుల వేగం తనను ఆశ్చర్యపరుస్తోందని, దేశ యువత ఏఐను అందిపుచ్చుకోవడంలో ముందుందని అన్నారు.

**ఏఐకి పరివర్తన శక్తి: మోడీ**

ప్రపంచంలోనే ఆరోవంతు జనాభా భారత్‌లోనే ఉందని, కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకోవడంలో దేశ యువత ఆసక్తి కనబరుస్తోందని ప్రధాని మోడీ తెలిపారు. భారత్ ఏఐ పురోభివృద్ధి ఒక చరిత్రగా నిలుస్తుందని, కృత్రిమ మేధకు పరివర్తన శక్తి ఉందని వివరించారు. "దాన్ని దుర్వినియోగం చేస్తే విధ్వంసానికి దారితీస్తుంది. అదే సద్వినియోగం చేసుకుంటే పరిష్కారాలు చూపుతుంది. మనుషులు, సాంకేతికత కలిసి అభివృద్ధి పయనం సాగించే శకంలో ఉన్నాం. భవిష్యత్తులో ఏఐ ఏం చేయగలదో కాదు.. ప్రస్తుతం కృత్రిమ మేధను ఉపయోగించి మనం ఏం చేయగలమనేదే అసలు ప్రశ్న. ప్రజల సంక్షేమం, శ్రేయస్సే ఏఐకి మన బెంచ్‌మార్కులు. మానవ కేంద్రీకృత ఏఐ నిర్మాణం మన లక్ష్యం కావాలి. కృత్రిమ మేధ మనల్ని కాదు.. మనం ఏఐని శాసించాలి" అని మోదీ పేర్కొన్నారు.

ఏఐ ఉద్యోగాలను తగ్గించదని, బదులుగా కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. "ఏఐ ఒక సహకార సాధనం, ఉద్యోగాలను గుణకారం చేస్తుంది" అని వ్యాఖ్యానించారు.

**'మానవ్' విజన్‌తో ఏఐ వినియోగం**

కృత్రిమ మేధ వినియోగంలో 'మానవ్ (MANAV) విజన్' ఉండాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఈ విజన్ అర్థం, ఫ్రేమ్‌వర్క్‌ను వివరిస్తూ..

**M - మోరల్ అండ్ ఎథికల్ సిస్టమ్:**
నైతిక విలువలు, బాధ్యతలను పరిగణనలోకి తీసుకుని ఏఐ వ్యవస్థలకు మార్గనిర్దేశం చేయాలి.

**A - అకౌంటబుల్:**
పారదర్శక నిబంధనలతో, జవాబుదారీతనంతో ఏఐ వ్యవస్థలు పనిచేయాలి.

**N - నేషనల్ సావర్నిటీ:**
ఒక దేశంలో సృష్టించిన డేటా ఆ దేశానికే చెందాలి, ఆ దేశ పరిధిలోనే ఉండాలి.

**A - యాక్సెసిబుల్ అండ్ ఇంక్లూజివ్:**
ఏఐ వ్యవస్థలు గుత్తాధిపత్యంతో పని చేయకుండా అన్ని వర్గాల వారికీ అందుబాటులోకి రావాలి.

**V - వేలిడ్ అండ్ లెజిటిమేట్:**
ఏఐ చట్టబద్ధంగా, విశ్వసనీయమైనదిగా పనిచేయాలి. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి.అని మోడీ వెల్లడించారు. ఈ విజన్ ఏఐను మానవకేంద్రీకృతంగా, సున్నితంగా, జవాబుదారీతనంతో మార్చడమే లక్ష్యమని ఆయన తెలిపారు. భారత్ ఏఐ రెవల్యూషన్‌లో భాగమే కాకుండా, దాన్ని లీడ్ చేస్తోందని, గ్లోబల్ రూల్స్ సెట్ చేయడంలో సహకరిస్తుందని పేర్కొన్నారు.

ఈ సమ్మిట్‌లో ప్రధాని స్పీచ్‌ను మొదటిసారిగా 11 భాషల్లో లైవ్ ట్రాన్స్‌లేట్ చేశారు, సైన్ లాంగ్వేజ్‌లో కూడా ఇంటర్‌ప్రెట్ చేశారు. ఇది ఏఐ ఇంక్లూసివ్‌నెస్‌ను చూపుతుందని నిర్వాహకులు తెలిపారు. భారత్‌లో ఏఐ టెక్నాలజీని సర్వసమానంగా అందుబాటు చేయడం, గ్లోబల్ సౌత్ దేశాలకు సహాయం చేయడం ఈ సదస్సు లక్ష్యాలుగా ఉన్నాయి.




# ఈ సారైనా.. హామీల అమలుకు నిధులు కేటాయించండి

**మొదటిపేజీ తరువాయి**

అమలుకు సరైన కేటాయింపులు చేయలేదని ఆరోపించారు. కనీసం రాబోయే బడ్జెట్‌లో అయినా ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల తరఫున ఈ విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.

ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల పేర్లు చెప్పి అధికారంలోకి వచ్చి వాటి అమలును పక్కన పెట్టారని కేటీఆర్ విమర్శించారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, యువత, రైతుల కోసం ప్రకటించిన పథకాలకు భారీగా నిధులు కేటాయించాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చిన హామీలకు కూడా బడ్జెట్‌లో స్పష్టమైన కేటాయింపులు చేయాలని డిమాండ్ చేశారు. రెండు సంవత్సరాలుగా వాగ్దానాలు అమలు కాలేదని, బకాయిలుగా ఉన్న నిధులను ఈసారి కేటాయించాలని సూచించారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత తీసుకువస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఆ మాట నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 202627 బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, డిక్లరేషన్ల కింద ఇచ్చిన వాగ్దానాల అమలుకు తగిన నిధులు కేటాయించకపోతే ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

రైతుబంధు విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని కేటీఆర్ అన్నారు. గతంలో కేసీఆర్ హయాంలో రైతులకు అందించిన రైతుబంధు మొత్తాన్ని రూ.15 వేలకి పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. ముందు రైతులకు క్షమాపణ చెప్పి, ఆ మొత్తాన్ని బడ్జెట్‌లో కేటాయించాలని కోరారు. ఉద్యోగాల భర్తీ విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారని, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలు కోసం కూడా స్పష్టమైన కేటాయింపులు చేయాలని అన్నారు.

ప్రస్తుతం మీడియాలో వస్తున్న సమాచారం ప్రకారం రాబోయే బడ్జెట్‌లో కూడా గ్యారెంటీలకు తగిన నిధులు కేటాయించే పరిస్థితి కనిపించడం లేదని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజాపాలన పేరిట మళ్లీ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రతిసారి ఇతర అంశాలను తెరపైకి తెచ్చి దృష్టి మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారెంటీ కార్డులు ఇప్పుడు బాకీ కార్డులుగా మారాయని వ్యాఖ్యానించారు. ప్రజల నోట్లో మట్టి కొట్టిన పాపాలకు ప్రాయశ్చిత్తం చేయాలంటే కనీసం ఈ బడ్జెట్‌లో అయినా హామీలకు నిధులు కేటాయించాలని సూచించారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే ప్రజలు నిలదీస్తారని హెచ్చరించారు. బడ్జెట్‌లో స్పష్టమైన కేటాయింపులు లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ ప్రశ్నిస్తామని అన్నారు. తెలంగాణ



ప్రజాగ్రహాన్ని తక్కువ అంచనా వేయవద్దని హెచ్చరించారు. మొత్తానికి, రాబోయే బడ్జెట్ హామీల అమలుకు పరీక్షగా మారిందని కేటీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తుందా లేదా అన్నది ఈ బడ్జెట్‌తో తేలిపోతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# గోవా గవర్నర్ కలిసిన బాపట్ల జిల్లా కలెక్టర్ బృందం

**బాపట్ల ఫిబ్రవరి 19 (ప్రజాస్వరం):**

తీరప్రాంత అభివృద్ధి లక్ష్యంగా గోవా పర్యటనలో ఉన్న బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ బృందం, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తీర పర్యాటక అభివృద్ధి, బీచ్ నిర్వహణ, భద్రతా చర్యలు, పర్యావరణ పరిరక్షణ అంశాలపై సవివరంగా చర్చించారు. బాపట్ల తీరాన్ని సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి గోవా నమూనాలను అనుసరించాలనే సంకల్పాన్ని కలెక్టర్ తెలియజేశారు. ఈ భేటీ ద్వారా బాపట్ల తీర ప్రాంత అభివృద్ధికి కొత్త దిశ లభించనుందని అధికారులు అభిప్రాయపడ్డారు.






# రాగి-జొన్న జావలతో, & ఆర్గానిక్ పంటలతో ప్రజా ఆరోగ్య సంరక్షణ...!!

- పల్లెల్లో ఆర్గానిక్ పంటలకు, ఆహార నిలువలకు ప్రోత్సాహం
- సంపూర్ణ ఆరోగ్యానికి దివ్యవుషదం ఆర్గానిక్ పంటలే
- ప్రజల్లో సామాజికవగాహన కార్యక్రమం నిర్వహించిన "పోతిరెడ్డి"

**బూర్గంపాడు,ఫిబ్రవరి 19 (ప్రజాస్వరం):**

బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజర్‌లోని పల్లెజావ దుకాణంలో లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ శ్రీ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి చిరుధాన్యాలు, ఆర్గానిక్ ఆహారపు అలవాట్లు గురించి స్థానిక ప్రజలకు రైతులకు వివరణాత్మక అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా మన పల్లెల్లో రాగి, జొన్న, గోధుమలు సులభంగా పండతాయని, కాఫీ లేదా టీ కాకుండా రాగి, జొన్న వంటి చిరుధాన్యాలతో తయారుచేసిన జావలతో ద్రవాలతో షుగర్, బిపి బ్లడ్ ప్రెషర్ లాంటి సహజ అనారోగ్య సమస్యలు తగ్గుముఖం పట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయని, జీర్ణవ్యవస్థ ప్రక్రియ బలంగా ఉంటుందని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని పిలుపునిచ్చారు.విషపూరీతంతో కూడుకున్న, కెమికల్స్ లేని ఆర్గానిక్ ఆహారపు అలవాట్లను నిరంతర జీవన ప్రక్రియగా అలవాటు చేసుకోవాలని, ఇది ఆర్థికంగా కూడా పండించే రైతాంగానికి లాభదాయకమని రైతులకు,యువతకు పిలుపునిచ్చారు.భద్రాద్రి జిల్లాలో, మన మండలంలో ఇలాంటి సామాజిక అవగాహనా కార్యక్రమాలు పెరిగితే గ్రామీణ ఆరోగ్యం అద్భుతంగా మెరుగుపడుతుందని, ఆర్గానిక్ జావ దుకాణాలు ఎక్కువైతే మన రైతులు, పిల్లలు, చుట్టూ ప్రజానీకం అందరికీ మేలు చేకూరుతుందని, ఈ బాధ్యాతాయుతమైన కార్యక్రమాన్ని అనునిత్యం ప్రజల్లో అవగాహన కల్పించడానికి మా వంతు తోడ్పాటు కల్పించేలా రైతులందరి సమిష్టి కృషితో ముందడుగుగా నిలుస్తామని పిలుపునిచ్చిన లక్ష్మీపురం మాజీ ఉప సర్పంచ్ శ్రీ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి.

# చీరాల కుప్పడం చీరను కొనుగోలు చేసిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు




**చీరాల,ఫిబ్రవరి 19 (ప్రజాస్వరం):**

అమరావతి లోని అసెంబ్లీ ఆవరణలో ఆప్కో ఆధ్వర్యంలో నిర్వహించిన హ్యాండ్లూమ్ ప్రదర్శనలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు చీరాల కుప్పడం చీరను కొనుగోలు చేశారు. మంత్రి ఆధ్వర్యంలో కుప్పడం చీరను కొనుగోలు చేసి, దాని ప్రత్యేకతలను వివరించిన తెలుగుదేశం పార్టీ చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య.మాలకొండయ్య మాట్లాడుతూ, కుప్పడం చీరలు రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. కుప్పడం చీరకు జాతీయ అవార్డు లభించడంతో, చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య మరియు చీరాల నేతన్నలను మంత్రి వర్యులు సవితమ్మ ప్రత్యేకంగా అభినందించారు. చీరాల హ్యాండ్లూమ్ కళాకారుల ప్రతిభ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం గర్వకారణమని పలువురు అభిప్రాయపడ్డారు.



# సుందరయ్య నగర్ అభివృద్ధి వైపు సరికొత్త అడుగు

**బూర్గంపాడు,ఫిబ్రవరి 19 (ప్రజాస్వరం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,బూర్గంపహాడ్ మండలం, సారపాక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సుందరయ్య నగర్ ప్రాంతం గడిచిన 25 సంవత్సరాలుగా దయనీయ స్థితిలోనే ఉండేది. ప్రతి ఎన్నికలో ఆశలు పెట్టుకొని ఓటేసి, ప్రతి నాయకుడిని వేడుకొని, ప్రతి ప్రభుత్వాన్ని నమ్మి దరఖాస్తులు ఇచ్చినా అభివృద్ధి మాత్రం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. బురద రోడ్లు, వర్షాకాల ఇబ్బందులు, రాకపోకల కష్టాలు ప్రజల నిత్య జీవితాన్ని భారంగా మార్చేవి.కానీ ఈసారి ప్రజలు తీసుకున్న నిర్ణయం వారి జీవితాల్లో వెలుగులు నింపింది. యువ నాయకత్వం, ముందుచూపు, ప్రజలతో మమేకమై పని చేసే తత్వం కలిగిన సర్పంచ్ శ్రీ కిషోర్ నాయక్‌ని గెలిపించుకోవడం ద్వారా సుందరయ్య నగర్ అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తోంది.సుందరయ్య నగర్ ఇప్పుడు సుందరమైన నగర్ గా ఎన్నికల సమయంలో మట్టి రోడ్లు లేకుండా చేస్తాను అని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, గెలిచిన మూడు నెలల్లోనే కార్యాచరణ మొదలుపెట్టి, కేవలం రెండు నెలల్లో సుందరయ్య నగర్, మస్జిద్ రోడ్డు, గణేష్ కాలనీ ప్రాంతాలలో సుమారు 30 సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయడం సారపాక చరిత్రలోనే ఒక రికార్డు. మరిన్ని రోడ్లు సీసీ రోడ్లుగా మారేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటివరకు బురదతో నిండిన మా వీధులు ఇప్పుడు సిమెంట్ రోడ్లతో మెరిసిపోతుండటం చూసి ప్రజలు భావోద్వేగానికి లోనవుతున్నారు.ఒక మంచి నాయకుడిని గెలిపించుకుంటే అభివృద్ధి అంటే ఇదే అని ప్రజలు ఆనంద భాష్పాలతో చెబుతున్నారు. తమ జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన సర్పంచ్ కిషోర్ నాయక్‌కి యావత్తు సుందరయ్య నగర్ ప్రజలు కుటుంబ సమేతంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.అదేవిధంగా 18వ వార్డు మెంబర్ శ్రీమతి పూజారి శ్రీదేవి ఎప్పటికప్పుడు ప్రజల మధ్య ఉంటూ, సమస్యలను స్వయంగా తెలుసుకొని పరిష్కార దిశగా కృషి చేస్తున్నందుకు వారికి కూడా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.సుందరయ్య నగర్ మరింత సుందరంగా మారుతోంది.అభివృద్ధి అంటే ఇదే అని చాటి చెప్పే విధంగా సారపాక గ్రామం ముందుకు సాగుతోంది.



# శక్తి యాప్ ప్రతి ఒక్క మహిళకు ఆయుధం

**చీరాల,ఫిబ్రవరి 19(ప్రజాస్వరం):**

చీరాల పట్టణంలోని ముత్యాలపేటలో మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చీరాల పట్టణంలోని ముత్యాలపేటలో జరిగిన ఈ కార్యక్రమం బాపట్ల జిల్లా ఐపీఎస్ అధికారి బి ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు నిర్వహించబడింది. చీరాల సబ్ డివిజన్ డీఎస్పీ మోయిన్ ఆధ్వర్యంలో శక్తి టీం సభ్యులు సిహెచ్ సునీత, బి ధనలక్ష్మి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న దొంగతనాలు, సైబర్ నేరాలు, చిన్నపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు మొబైల్ ఫోన్ ఉపయోగిస్తే వారు ఏం చూస్తున్నారో పర్యవేక్షించాలని సూచించారు. అలాగే పిల్లలను ఎవరితోనైనా పంపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. శక్తి యాప్ ప్రతి మహిళకు ఒక రక్షణ ఆయుధమని, ఆపద సమయంలో దానిని ఎలా ఉపయోగించుకోవాలో ప్రాక్టికల్‌గా వివరించారు. అలాగే అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు 100, 112, 1930, 181 గురించి అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శక్తి యాప్‌పై స్పష్టమైన అవగాహన పొందారు.



## రామానుజవరం–కొత్త మల్లేపల్లి గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న వంతెన పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 19 (ప్రజాస్వరం):**

పినపాక నియోజకవర్గం మణుగూరు మండలంలోని రామానుజవరం నుండి కొత్త మల్లేపల్లి గ్రామానికి వెళ్లే మార్గమధ్యంలో ఈ తరువాయి వాగుపై సుమారు ₹2 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న వంతెన పనులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా వంతెన నిర్మాణ పురోగతిని అధికారులతో సమీక్షించిన ఆయన, పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణంలో ఎటువంటి లోపాలు లేకుండా, వంతెన బలంగా మరియు దీర్ఘకాలం నిలిచేలా నిర్మించాలని సూచించారు.వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల మధ్య రాకపోకలకు ఈ వంతెన ఎంతో కీలకమని పేర్కొంటూ, నిర్ణీత గడువులో పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు పనులను వేగవంతం చేసి గడువులోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, గుండగాని నాగేశ్వరావు, తమ్మిశెట్టి సాంబశివరావు,సాదిని సీతయ్య, కృష్ణరావు,కేతినేని రాజేష్,రాసాల నాగరాజు పాల్గొన్నారు.



## ఒంటరి మహిళపై దాడి – మహిళల భద్రత ఎక్కడ? నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి!.

- **శీలం రోజన్ బాబు.. అధికార ప్రతినిధి మాల మహానాడు ఆంధ్ర ప్రదేశ్.**

**బాపట్ల,ఫిబ్రవరి 19 (ప్రజాస్వరం):**

బాపట్ల జిల్లాలో బాపట్ల పట్టణము లో భర్త లేని ఒంటరి మహిళపై ఓ పురుషుడు దాడి చేసిన ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. సమాజంలో రక్షణ అవసరమైన మహిళలపై ఇలాంటి దాడులు జరగడం అమానుషం, అంగీకరించలేనిది. ఘటనపై ఆగ్రహం భర్త లేక ఒంటరిగా జీవిస్తున్న మహిళను లక్ష్యంగా చేసుకుని దాడి చేయడం దారుణం. మహిళలపై హింసను అరికట్టడంలో స్థానిక వ్యవస్థల వైఫల్యం బయటపడింది. బాధితురాలికి తక్షణ వైద్య సహాయం, భద్రత కల్పించాలి. చట్టపరమైన చర్యలు మహిళలపై దాడి చేయడం భారత శిక్షాస్మృతి (IPC) మరియు ఇతర మహిళా రక్షణ చట్టాల ప్రకారం శిక్షార్హమైన నేరం. పోలీస్ అధికారులు వెంటనే కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపి త్వరితగతిన న్యాయం చేయాలి. మా డిమాండ్లు నిందితుడిపై కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి. బాధితురాలికి ఆర్థిక సాయం, రక్షణ కల్పించాలి. మహిళల భద్రత కోసం పట్టణ స్థాయిలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.



మహిళలపై దాడులు పెరుగుతున్నాయి అంటే అది సమాజానికి మచ్చ. ఒంటరి మహిళలపై దాడులు చేయడం పిరికి పందల చర్య. ఇలాంటి నేరస్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపశమనం ఇవ్వకూడదు. మహిళల భద్రత ప్రభుత్వ బాధ్యత - నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి కఠిన ఉంచాలని శీలం రోజన్ బాబు డిమాండ్ చేశారు.

## సొంతింటి కల నెరవేర్చిన 'ఇందిరమ్మ ఇల్లు' – లబ్ధిదారుల ఆనందం

**వనపర్తి,ఫిబ్రవరి 19 (ప్రజాస్వరం):**

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన సొంతింటి కల 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా నెరవేరిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. వనపర్తి పట్టణం 1వ వార్డు రాయిగడ్డ కు చెందిన శ్యామల, యాదగిరి దంపతులు నిర్మించుకున్న నూతన గృహానికి గురువారం గృహప్రవేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి హాజరై దంపతులకు నూతన వస్త్రాలు అందించి అభినందించారు. రూ.5 లక్షల ఆర్థిక సాయంతో ఇల్లు నిర్మించుకోగలిగామని, ఇందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో సంవత్సరాలు అద్దె ఇళ్లలో కష్టాలు పడ్డామని, ఆర్థిక ఇబ్బందుల వల్ల సొంతింటి కల దూరమైందని, ప్రస్తుతం ప్రభుత్వం అందించిన సహాయంతో గూడు కట్టుకున్నామని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి ఎప్పుడూ స్పందిస్తూ సహకరించారని వారు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మాజీ కౌన్సిలర్ బ్రహ్మచారి, వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మధుసూదన్ రెడ్డి,దేవన్న నాయుడు తదితరులు పాల్గొన్నారు.





## కామ్రేడ్ చుక్క సత్యానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నివాళి.

**వనపర్తి,ఫిబ్రవరి 19 (ప్రజాస్వరం):**

వనపర్తి పట్టణం 1వ వార్డు కౌన్సిలర్ చుక్క జయశ్రీ రాజు మామయ్య, కమ్యూనిస్టు నేత కామ్రేడ్ చుక్క సత్యం ఇటీవల ఆకస్మికంగా కన్నుమూశారు. గురువారం ఆయన నివాసంలో నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై సత్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యం రాజకీయ సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ, కౌన్సిలర్ బ్రహ్మచారి, మధుసూదన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ నక్క రాములు, స్థానిక నాయకులు దేవన్న నాయుడు, బోయ మురళి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## 150 మంది విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్స్ బహుకరణ

**పందిళ్ళపల్లి,ఫిబ్రవరి 19 (ప్రజాస్వరం):**

వేటపాలెం స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాలలో 1999 2000 సంవత్సరంలో పదవ తరగతి విద్యార్థులు రజతోత్సవం సందర్భంగా వేటపాలెం బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల నందు మరియు పందిళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 10 తరగతి విద్యార్థులకు 150 మంది విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్స్ బహుకరించారు. పూర్వ విద్యార్థుల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు పొన్నూరు రవి, అందే కుమార్ ,అవ్వారు మోహన్ రావు, షఫీ, కల్లూరి మాధవ రావు ,కే భరత్ , ఐనాల మధు, సంతోష్ ,సుందరరాజు , బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ వాసుదేవరావు పందిళ్ళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలప్రధానోపాధ్యాయురాలు టీ. దీప్తి తదితర ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## రాష్ట్ర స్థాయి క్రీడల్లో దుర్గ భవాని ప్రశంస పత్రం అందజేసిన కలెక్టర్ జితేష్ వి. పాటేల్

**పినపాక,ఫిబ్రవరి 19 (ప్రజాస్వరం):**


భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని జగ్గరం గ్రామ నివాసి దుర్గ భవాని రాష్ట్ర స్థాయి క్రీడాల్లో రాణించినందుకు ఐ.టి.డీ.ఏ భద్రాచలం వేదికగా జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటేల్ ప్రశంచించి సన్మానం చేశారు సర్టిఫికెట్ అందజేసిన అభినందనలు తెలిపారు భవిష్యత్ లో చాలా మంచి స్థాయికి చేరి ఎందరికో ఆదర్శం కావాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జగ్గరం సర్పంచ్ సున్నం తిరుపతమ్మ, ఉప సర్పంచ్ లకేల రమేష్, ఊకె సాయి దుర్గ భావానికి అభినందనలు తెలిపారు సర్పంచ్ మాట్లాడుతూ మా గ్రామ నివాసి తండ్రి దేరంగుల రాము తల్లి నాగమణి దంపతుల కుమార్తె దుర్గ భవాని తల్లిదండ్రుల ప్రోత్సాహంతో హైదరాబాద్ లోని దోమల గూడా ప్రభుత్వ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి దివ్యంగుల ఆటలపోటీలలో మణుగూరు భవిత స్కూల్ యందు చదువుకుంటూ లెమన్ అండ్ స్పూన్ విభాగంలో రెండవ స్థానంలో నిలిచినందుకు తన వలన మాకు గర్వంగా ఉందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో దుర్గ భవానికి అభినందనలు తెలిపిన గ్రామ యువత ఊకె సాయి కుమార్, కోటి,సాగర్,జంపయ్య పాల్గొన్నారు.

## ఓం శ్రీ గెలాక్సీ నిర్మాణంలో విషాదం... 5వ అంతస్తు నుంచి చిన్నారి పడి మృతి

- **నిర్మాణ భవనంలో భద్రత లోపం? నాలుగేళ్ల పాప మృతి**
- **కార్మిక శిబిరంలో కన్నీటి విషాదం...కుమార్తె మృతి**

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 19(ప్రజాస్వరం):**

పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంపల్లి ప్రాంతంలో ఓం శ్రీ గెలాక్సీ నిర్మాణ స్థలంలో దురదృష్టకర ఘటన చోటుచేసుకుంది. ఐదో అంతస్తు నుండి కిందపడిన నాలుగేళ్ల చిన్నారి మృతి చెందింది. పెట్ బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం... ఫిర్యాదుదారుడు శ్రీ ప్రదీప్ (32), తండ్రి శివసింగ్, వృత్తి కూలీ, నివాసం ఉమా మహేశ్వర కాలనీ, కొంపల్లి, స్వస్థలం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. ఆయన నిర్మాణ స్థలంలో పని చేస్తూ కార్మికుల శిబిరంలోనే నివసిస్తున్నాడు. గురువారం ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో ప్రదీప్ భార్య ఉమా మరియు మేస్త్రీ మోను కలిసి నిర్మాణంలో ఉన్న భవనం 5వ అంతస్తులో శుభ్రపరిచే పనులు చేస్తున్నారు. ఈ సమయంలో వారి నాలుగేళ్ల కుమార్తె కావ్య బర్మా పక్క గదిలోని బాల్కనీలోకి వెళ్లింది. బాల్కనీ వద్ద గాజు ఉందని భావించి పట్టుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు ఐదో అంతస్తు నుంచి కిందపడిపోయింది. తీవ్ర గాయాల పాలైన చిన్నారిని వెంటనే సమీపంలోని అంకురా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరిశీలించి మృతిచెందినట్లు ధృవీకరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిర్మాణ ప్రాంగణంలో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అన్న దానిపై కూడా విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ విషాద ఘటనతో నిర్మాణ కార్మికుల శిబిరంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.






## భీంగల్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో యువ కిశోర బాలురకు లింగ సమానత్వంపై శిక్షణ కార్యక్రమం

**భీంగల్ ఫిబ్రవరి19(ప్రజాస్వరం):**

జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో - బేటి పడావో కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా భీంగల్ ప్రాజెక్ట్ పరిధిలోని భీంగల్ మండల కేంద్రంలో గల మైనారిటీ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్లో యువ కిశోర బాలురకు లింగ సమానత్వంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఏఆర్ ఎడ్యుకేషన్ ట్రైనర్ అపర్ణ మేడం మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న లింగ వివక్షత అంశాలను ఉదాహరణలతో వివరించి, యువ కిశోర బాలురలో లింగ సమానత్వంపై అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని తెలియజేశారు.లింగ వివక్షతపై బాలురకు అవగాహన కల్పించారు.లింగ వివక్షతను వినడంలో వారి యొక్క పాత్ర తెలియజేశారు. ముఖ్యంగా డ్రగ్స్ అబ్యూస్,పోక్సో చట్టం గురించి వివరించడం జరిగింది.ఈ శిక్షణ కార్యక్రమంలో బాలురు,బాలికల మధ్య సమాన హక్కులు,గౌరవం, పరస్పర అవగాహన గురించి వివరించడంతో పాటు,మహిళలు ,బాలికలపై వివక్ష, హింసను నివారించడంలో బాలుర పాత్ర ఎంతో ముఖ్యమని తెలియజేశారు.అలాగే బాల్యవివాహాలు, బాలలపై దుర్వినియోగం వంటి సామాజిక సమస్యలపై చర్చించి, సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడంలో యువత బాధ్యతను గుర్తుచేశారు.ఈ శిక్షణ ద్వారా యువ కిశోర బాలురలో సానుకూల దృక్పథం పెరిగి,లింగ సమానత్వాన్ని పాటించే సమాజ నిర్మాణానికి వారు తోడ్పడతారని నిర్వాహకులు తెలిపారు .ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్స్ శారదా , విజయ రాణి, స్కూల్ ప్రిన్సిపాల్, స్కూల్ సిబ్బంది విద్యార్థులు, జిల్లా మహిళా సాధికారత సిబ్బంది స్వప్న,సౌమ్య,కవిత తదితరులు పాల్గొన్నారు.




## వలిగొండ రహదారి వెడల్పు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కుంభం

**వలిగొండ ఫిబ్రవరి 19(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో జరుగుతున్న భువనగిరిచిట్యాల రహదారి వెడల్పు పనులను గురువారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిశీలించారు. పనులు త్వరితగతిన, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారస్తులకు శాశ్వత మడిగలు కట్టించి, వారికి అందుబాటులోకి తెస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం,వలిగొండ లింగరాజు పల్లిలో 50 లక్షల రూపాయలతో మంజూరైన సీసీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-205, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/20, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999